# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 04-11-2025** **సమయం : 6.45 గంటలు**

# ముఖ్యాంశాలు

1. **ఆంధ్రప్రదేశ్‌లో అంతరిక్షరంగ పరికరాల తయారీకి తగిన వనరులు అందుబాటులో ఉన్నాయని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు.**

2. **పంటపొలాలు ధ్వంసం చేస్తున్న అడవి ఏనుగుల కట్టడికి కృత్రిమ మేధ సాంకేతికతను అందుబాటులోకి తెచ్చామని ఆంధ్రప్రదేశ్ ఉపముఖ్యమంత్రి కె పవన్ కళ్యాణ్ వెల్లడించారు.**

3. **ఆంధ్రప్రదేశ్‌లో 51 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలుకు చర్యలు తీసుకుంటున్నామని పౌరసరఫరాల శాఖ మంత్రి నాందెడ్ల మనోహర్ చెప్పారు.**

4. **ఏపీఎస్ఆర్టీసీ ఉద్యోగుల సంక్షేమానికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కట్టుబడి ఉందని రవాణా శాఖ మంత్రి ఎం. రాంప్రసాద్ రెడ్డి పేర్కొన్నారు.**

5. **ఎకరానికి ఏడు క్వింటాళ్ల పత్తి కొనుగోలు చేయాలనే నిబంధనను సడలించాలని తెలంగాణ వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కోరారు.**

==========================

ఆంధ్రప్రదేశ్‌లో అంతరిక్షరంగ పరికరాల తయారీకి తగిన వనరులు అందుబాటులో ఉన్నాయని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు. లండన్ పర్యటనలో భాగంగా వివిధ పారిశ్రామిక వేత్తలతో ముఖ్యమంత్రి నిన్న వరుసగా సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో పెట్టుబడులకు ఉన్న అవకాశాలను, వనరుల గురించి ముఖ్యమంత్రి వివరించారు. ఓర్వకల్లులో మిలటరీ ఎయిర్ స్ట్రిప్, విమానాల నిర్వహణ, మరమ్మత్తులు, పునరుద్ధరణ కేంద్రం యూనిట్ ఏర్పాటుకు అవకాశాలు ఉన్నాయని చెప్పారు. విశాఖపట్నం, తిరుపతిలలో గ్లోబల్ కెపాబిలిటీ సెంటర్ -జీసీసీ ఏర్పాటు అవకాశాలను పరిశీలించాలని, భోగాపురం విమానాశ్రయం సమీపంలోనూ ఏవియేషన్ ఎకోసిస్టం ఏర్పాటుకు అవకాశముందని వెల్లడించారు.

-------------------------

అంతర్గత జలరవాణా మార్గాల ద్వారా అతి తక్కువ వ్యయంతో సరుకు జల రవాణా చేసేలా మెరుగైన అవకాశాలు ఆంధ్రప్రదేశ్‌కు ఉన్నాయని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. లండన్ పర్యటనలో భాగంగా వివిధ పారిశ్రామిక వేత్తలతో రౌండ్ టేబుల్ సమావేశాన్ని ముఖ్యమంత్రి నిర్వహించారు. ఈ సందర్భంగా చంద్రబాబు నాయుడు మాట్లాడుతూ, అమరావతిలోనూ వచ్చే జనవరి నాటికి ఏఐ క్వాంటం కంప్యూటింగ్ కేంద్రం ప్రారంభం కానుందని తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌ను లాజిస్టిక్ కారిడార్‌గా అభివృద్ధి చేసేలా

ప్రణాళికలు రూపొందిస్తున్నామని పారిశ్రామిక వేత్తలకు వివరించారు. రాష్ట్రంలో రోడ్డు, రైలు, వాయు మార్గాలతో పాటు జల రవాణా ద్వారా సరకు రవాణాపై పెట్టుబడులు పెట్టాలని కోరారు.

---------------------------

హైదరాబాద్–బీజాపూర్ రోడ్డుపై రంగారెడ్డి జిల్లా చేవెళ్ల మండలం మీర్జాగూడ గేటు వద్ద నిన్న ఉదయం జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో 19 మంది మృతి చెందగా మరికొంతమంది గాయపడ్డారు. వికారాబాద్ జిల్లా తాండూరు నుంచి హైదరాబాద్‌కు వస్తున్న ఆర్టీసీ బస్సును ఎదురుగా వచ్చిన కంకర టిప్పర్ ఢీకొట్టడంతో ఈ ఘటన చోటు చేసిందని అధికారులు తెలిపారు. రోడ్డు ప్రమాదంపై తెలంగాణ గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, ముఖ్యమంత్రి ఏ. రేవంత్‌రెడ్డి తీవ్ర విచారం వ్యక్తంచేశారు. ప్రమాద ఘటనలో ప్రాణాలు కోల్పోయిన వారికి చేవెళ్ల ప్రభుత్వాస్పత్రిలో శవపరీక్షలు కొనసాగుతున్నాయి. చేవెళ్ల ప్రభుత్వాస్పత్రిలో 14 మృతదేహాలకు శవపరీక్షలు పూర్తి చేసి బంధువులకు అప్పగించామని వైద్యులు తెలిపారు. క్షతగాత్రులకు మెరుగైన చికిత్స కొనసాగిస్తున్నామని వైద్యులు తెలియజేస్తూ,

వాయిస్..30 సెకన్లు

---------------------------

పంటపొలాలు ధ్వంసం చేస్తున్న అడవి ఏనుగులను కట్టడి చేసేందుకు కృత్రిమ మేధ–ఏఐ ఆధారిత సాంకేతికతను అందుబాటులోకి తెచ్చామని ఆంధ్రప్రదేశ్ ఉపముఖ్యమంత్రి కె పవన్ కళ్యాణ్ అన్నారు. చిత్తూరు జిల్లాలో పైలెట్ ప్రాజెక్ట్ కింద దీనిని ప్రారంభించినట్లు ఈ మేరకు సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా వెల్లడించారు. ఏఐ వ్యవస్థ, సౌరశక్తి సాయంతో పని చేస్తూ ఏనుగుల సంచారాన్ని గుర్తించడంతోపాటు వాటిని స్వల్పంగా భయపెట్టే నిరోధక వ్యవస్థను కలిగి ఉంటుందని తెలిపారు. ఏనుగులను గుర్తించిన వెంటనే అటవీ శాఖ అధికారులకు హెచ్చరిక సంకేతాలు పంపి, అటు మనుషులకు, ఇటు వన్యప్రాణులకు రక్షణ వ్యవస్థలా ఉపయోగపడతాయని పేర్కొన్నారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లో 51 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలుకు చర్యలు తీసుకుంటున్నామని పౌరసరఫరాల శాఖ మంత్రి నాందెడ్ల మనోహర్ చెప్పారు. పశ్చిమగోదావరి జిల్లా తాడేపల్లిగూడెం మండలం ఆరుగొలనులో ఖరీఫ్ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని నిన్న ప్రారంభించారు. ఈ సందర్భంగా నాదెండ్ల మనోహర్ మాట్లాడుతూ,

వాయిస్ .. 28 సెకన్లు

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లో వేగవంతమైన వాణిజ్య విధానంతో పెట్టుబడులు పెట్టేందుకు పారిశ్రామిక వేత్తలకు అన్ని సదుపాయాలు కల్పిస్తున్నామని పురపాలక శాఖ మంత్రి పి.నారాయణ పేర్కొన్నారు. రాష్ట్రానికి పెట్టుబడుల సాధన లక్ష్యంగా దుబాయ్‌లో పర్యటిస్తున్న మంత్రి ఈ నెల 14,15 తేదీల్లో విశాఖపట్నంలో జరిగే సీఐఐ భాగస్వామ్య సదస్సుకు రావాలని పారిశ్రామిక వేత్తలను ఆహ్వానించారు. దుబాయ్ పర్యటనలో భాగంగా నిన్న దుబాయ్ ఇండియా కాన్సుల్ ప్రతినిధులు బి.జి. కృష్ణన్, సెలీనా శశికాంత్‌తో మంత్రి నారాయణ బృందం సమావేశమైంది. ఏకగవాక్ష విధానంలో అన్ని అనుమతులు జారీ చేసి త్వరితగతిన పరిశ్రమలు ఏర్పాటైయ్యేలా చర్యలు తీసుకుంటున్నట్లు మంత్రి వివరించారు.

---------------------------

ఏపీఎస్ఆర్టీసీ ఉద్యోగుల సంక్షేమానికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కట్టుబడి ఉందని రవాణా శాఖ మంత్రి ఎం. రాంప్రసాద్ రెడ్డి తెలిపారు. తిరుపతిలోని అలిపిరి బస్ డిపోలో ఆర్టీసీ సిబ్బంది కోసం నిర్మించిన వైద్యశాలను మంత్రి నిన్న ప్రారంభించారు. అత్యాధునిక సౌకర్యాలతో నిర్మించిన ఈ వైద్యశాల ఆర్టీసీ ఉద్యోగులకు మరింత మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ఉపయోగపడుతుందని ఈ సందర్భంగా మంత్రి తెలియజేస్తూ,

వాయిస్ 32 సెకన్లు

---------------------------

ఎకరానికి ఏడు క్వింటాళ్ల పత్తి కొనుగోలు చేయాలనే నిబంధనను సడలించాలని తెలంగాణ వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కోరారు. 20శాతం వరకు తేమ ఉన్నా కొనాలని కోరుతూ ఈ మేరకు కేంద్ర జౌళిశాఖ మంత్రి గిరిరాజ్ సింగ్‌కు ఆయన లేఖ రాశారు. రాష్ట్రంలో ఎకరానికి 15 క్వింటాళ్ల దిగుబడి వస్తోందని ఈ సీజన్‌లో ఇప్పటికే ఒక్కో రైతు నుంచి ఎకరానికి 12 క్వింటాళ్ల చొప్పున కొనుగోలు చేశామన్నారు. ఈ తరుణంలో 7 క్వింటాళ్ల కంటే ఎక్కువ కొనవద్దంటూ కొనుగోలు కేంద్రాల అధికారులను భారత పత్తి సమాఖ్య-సీసీఐ ఆదేశించడం సరికాదని పేర్కొన్నారు.

---------------------------

గిరిజన ప్రాంతాల్లో మౌలిక సదుపాయాలు కల్పించేందుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని కురుపాం శాసన సభ్యురాలు టి.జగదీశ్వరి అన్నారు. పార్వతీపురం మన్యం జిల్లా కురుపాం మండల కేంద్రంలో ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ ఉన్నత పాఠశాలలో నూతన భవన నిర్మాణానికి ఆమె నిన్న శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా జగదీశ్వరి మాట్లాడుతూ, ప్రధానమంత్రి జన్ మన్ పథకం కింద 2 కోట్ల 75 లక్షల రూపాయల వ్యయంతో ఈ భవనాన్ని నిర్మించనున్నామని తెలిపారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్, యానాం దిగువ ట్రోపో ఆవరణంలో వాయవ్య దిశగా గాలులు వీస్తున్నాయని అమరావతిలోని వాతావరణ కేంద్రం వెల్లడించింది. దీని ప్రభావంతో రాష్ట్రంలో ఈరోజు తేలికపాటి నుండి ఒక మోస్తరు వర్షాలు కురిసే అవకాశముందని వాతావరణ శాఖ అధికారి ఎమ్. వెంకట్రావు తెలియజేశారు.

తెలంగాణలోనూ ఈరోజు, రేపు తేలికపాటి నుండి ఒక మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది.

=====================